సాక్షి మెదక్

మంగళవారం । 12 । నవంబర్ । 2024



నామమాత్రమే..

సిద్దిపేట పట్టణ శివారులో సుడా చేసిన లేఅవుట్ స్థలాల బహిరంగ వేలం పాటకు స్పందన కరువైంది. వివరాలు 8లో ▸



వరుస హత్యల కేసు కొలిక్కి!

ఒకే తరహాలో జరిగిన వరుస హత్యల కేసులో ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వివరాలు 8లో ▸



పింఛన్ ఇప్పించమని..

సమగ్ర ఇంటింటి సర్వేలో పలువురు పింఛన్ రావడం లేదని రాయలంటూ పట్టుబడుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నల్లపోచమ్మకు కార్తీక శోభ



కౌడిపల్లి(నర్సాపూర్): కార్తీక సోమవారం మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేకంగా దీపాలు వెలిగించారు. ఆలయ పూజారులు శివప్ప, రాజేష్, జూనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

కొప్పోల్‌లో జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు



పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో జిల్లా జడ్జి లక్ష్మీశారద సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పురోహితులు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆమె వెంట జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ జితేందర్ తదితరులు ఉన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన అవసరం



మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు అవగాహన

నర్సాపూర్ రూరల్: మూఢనమ్మకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్, సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. సోమవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, భౌతికశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు మూఢనమ్మకాలను వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను నిర్మూలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ కుమార్, అధ్యాపకులు సమీరా, సౌజన్య, అనిత, రుక్మిణి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వరి కోత సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): వరి కోత సమయంలో రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ సూచించారు. ఈమేరకు ఆయన సోమవారం మండల పరిధిలోని తీన్ నంబర్ తండా, జెమ్లా తండాలో వరి కోతలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. హార్వెస్టర్‌తో వరి కోతలు నిర్వహిస్తే దాని వేగం 18 నుంచి 18 ఆర్పీం ఉండే విధంగా చూడాలన్నారు. మిషన్‌లో బ్లోయర్లు (గాలి ఊదే పరికరం) ఆన్‌లో ఉంచాలన్నారు. కరెంట్ తీగలను జాగ్రత్తగా పరిశీలించాలని, లేకపోతే విద్యుత్ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తూప్రాన్/శివ్వంపేట(నర్సాపూర్): మనోహరాబాద్‌లోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. తూప్రాన్ టౌన్‌తో పాటు మండలంలో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే శివ్వంపేట మండలంలోని శభాష్‌పల్లి, గుండ్లపల్లి 32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరా ఉండదని ఇన్‌చార్జి ఏఈ సాయికుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువుకు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. మినీ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన స్కై సైక్లింగ్‌కు యువత ఆసక్తి చూపుతుండటంతో నిత్యం సందడిగా మారుతోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ చెరువుపై స్కై సైక్లింగ్ చేస్తూ ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

‘మనబడి’ బిల్లులేవి?

- జిల్లావ్యాప్తంగా రూ. 9 కోట్లు పెండింగ్
- ఏడాదిగా తీవ్ర జాప్యం
- అవస్థలు పడుతున్న ఎస్ఎంసీ చైర్మన్లు



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు శ్రీనివాస్. మెదక్ మండలం మక్తభూపతిపూర్ గ్రామం. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ స్కూల్ అభివృద్ధి కోసం మన ఊరు– మనబడి పథకం కింద ప్రభుత్వం రూ. 25 లక్షలు కేటాయించింది. రూ. 23 లక్షలు అప్పు తెచ్చి పాఠశాలలో వివిధ రకాల మరమ్మతులు చేపట్టారు. కాగా ఈయనకు ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. ఇలాంటి వారు జిల్లాలో వందలాది మంది ఉన్నారు.

మెదక్‌జోన్: మనఊరు– మనబడి బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం నెలకొంది. పనులు చేసి ఏడాది అవుతున్నా బిల్లులు రావడం లేదని ఎస్ఎంసీ చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు తెచ్చి పనులు చేశామని వాపోతున్నారు. గత ప్రభుత్వం 2022లో మన ఊరు– మన బడి పథకం కింద జిల్లాలో 315 పాఠశాలలను ఎంపిక చేసింది. వాటి అభివృద్ధి కోసం రూ. 65 కోట్లు మంజూరు చేసింది. ఇందులో అదనపు గదుల నిర్మాణాలు, కరెంట్, డైనింగ్ హాల్స్, కిచెన్‌షెడ్, టాయిలెట్స్‌తో పాటు వివిధ రకాల పనులు చేపట్టాలని సూచించింది. రూ. 30 లక్షల పైచిలుకు నిధులు మంజూరైతే టెండర్ ద్వారా చేయాలని, ఆ లోపు అయితే నేరుగా పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్లు పనులు చేయవచ్చనే నిబంధన పెట్టింది. కాగా టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోవడంతో రూ. కోటి లోపల మంజూరైన పాఠశాలను సైతం ఎస్ఎంసీ చైర్మన్లు చేయవచ్చని చెప్పింది. కాగా అందులో 100 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా మిగిలిన 215 పాఠశాలల్లో వివిధస్థాయిలో పనులు నిలిచిపోయాయి. బిల్లులు రాకపోవడంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. పనులు పూర్తి చేయకపోవడంతో పాఠశాలల్లో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మన ఊరు– మనబడి పథకాన్ని నిలిపివేసింది. దాని స్థానంలో ‘అమ్మ ఆదర్శ పాఠశాల’ పథకాన్ని ప్రవేశపెట్టింది. పాఠశాలల మరమ్మతుల కోసం నిధులు విడుదల చేసింది. పనులు చేసిన వారికి బిల్లులు సైతం ఇచ్చింది. కానీ గతంలో అర్ధాంతరంగా వదిలేసిన పాఠశాలల్లో మాత్రం పనులు చేపట్టడం లేదు. అలాగే మన ఊరు– మనబడి కింద పనులు చేసిన ఎస్ఎంసీ చైర్మన్లతో పాటు పలువురికి సుమారు రూ. 9 కోట్ల పైచిలుకు బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో బాధితులు ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి వినతులు అందజేస్తున్నారు. ఇప్పటికైనా నిధులు విడుదల చేయాలని, లేకపోతే పాఠశాలలకు తాళాలు వేస్తామని హెచ్చరిస్తున్నారు.



మక్తభూపతిపూర్ పాఠశాలలో నిర్మించిన డైనింగ్‌హాల్

రైతులకు అండగా నిలవాలి



కేటీఆర్‌తో ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

నర్సాపూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఇటీవల కొల్చారంలో చేపట్టిన రైతు దీక్ష విజయవంతం అయిందని చెప్పగా.. కేటీఆర్ అభినందించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ధాన్యం కొనాలని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం మండలంలోని గవ్వలపల్లి చౌరస్తా మెదక్– చేగుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రైతులకు మద్దతుగా బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నిలిచారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి ఇరవై రోజులు అవుతున్నా కాంటా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు రైతులను సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు, నరేందర్‌రెడ్డి, సురేష్, రాజు యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి

కలెక్టర్ రాహుల్‌రాజ్

పెద్దశంకరంపేట(మెదక్): జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్యుమరేటర్లు ప్రజల నుంచి సమాచారం ఏ విధంగా సేకరిస్తున్నారు. వివరాల నమోదు ఎలా చేస్తున్నారని ఆరా తీశారు. ప్రతీ రోజు ఒక ఎన్యుమరేటర్ 15 నుంచి 20 ఇళ్ల వరకు సర్వే పూర్తి చేసేలా చూడాలన్నారు. ప్రజలు తమ వివరాలను నిర్భయంగా అందించాలని సూచించారు. దుష్ప్రచారం నమ్మవద్దని కోరారు.



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, తహసీల్దార్ గ్రేస్‌బాయి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఈఓ వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గురుకుల క్రీడలు

మెదక్‌జోన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం 10వ రాష్ట్రస్థాయి జోనల్ స్పోర్ట్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన 13 గురుకుల పాఠశాలల క్రీడాకారులు 1,105 మంది హాజరయ్యారు. ఈనెల 14వ తేదీ వరకు పోటీలు కొనసాగనుండగా, విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. తొలిరోజు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, కో ఆర్డినేటర్ సువర్ణలత క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నిరంతర సాధనతోనే అన్నిరంగాల్లో రాణిస్తారని తెలిపారు.



క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్

సమగ్ర వివరాలు సేకరించాలి

డీపీఓ యాదయ్య

టేక్మాల్(మెదక్): కుటుంబ సర్వేలో సమగ్ర వివరాలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లంపల్లిలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించి మాట్లాడారు. సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని కోరారు. సర్వే ఫారంలో ఎట్టి పరిస్థితుల్లో తప్పులు నింపవద్దని, ఏమైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆయన వెంట పాటు ఎంపీఓ రియాజొద్దీన్, పంచాయతీ కార్యదర్శి సత్యం తదితరులు ఉన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ నగేశ్
- ప్రజావాణికి 65 వినతులు

మెదక్‌జోన్: ప్రజావాణికి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 65 వినతులు రాగా, వాటిని స్వీకరించి ఆయాశాఖల అధికారులకు బదిలీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న ప్రజావాణిలో ఏశాఖ వద్ద ఎన్ని అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయో తెలపాలని సూచించారు. ఏదైనా సమస్యతో పరిష్కారం కాకుంటే అందుకు సంబంధించిన విషయాన్ని అర్జీదారుడికి వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్–3 పరీక్ష

సమన్వయంతో గ్రూప్–3 పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈనెల 17, 18వ తేదీల్లో కొనసాగే పరీక్షకు జిల్లావ్యాప్తంగా 5,867 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకోసం 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ.. పరీక్షను పకడ్బందీగా నిర్వహించడానికి పోలీస్ నోడల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

దళారుల చేతిలో పత్తి రైతు దగా

అల్లాదుర్గం(మెదక్): దళారుల చేతిలో పత్తి రైతులు దగాకు గురవుతున్నారు. ప్రభుత్వం పత్తికి మద్దతు ధర ప్రకటించినా.. దోపిడీ మాత్రం ఆగడం లేదు. గ్రామాల్లో పత్తి జీరో దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అడుగడుగునా అక్రమ పత్తి కొనుగోలు దుకాణాలు వెలుస్తున్న అడిగే వారు కరువయ్యారు. ఏటా వందల లారీల్లో పత్తిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అల్లాదుర్గం మండలంలోని చిల్వెర, ముస్లాపూర్, బహిరన్ దిబ్బ, చేవెళ్ల గ్రామాల్లో పత్తి అక్రమ దందా జోరుగా కొనసాగుతోంది. అల్లాదుర్గం ఉమ్మడి మండలం వట్‌పల్లి కేంద్రంగా ఈ దందా నడుస్తోంది. వట్‌పల్లిలో 20 నుంచి 30 మంది ఫర్టిలైజర్ షాపులు ఏర్పాటు చేసి జీరో వ్యాపారం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో పలుకుబడి ఉన్న వ్యక్తిని బ్రోకర్‌గా పెట్టుకొని ప్రతి రైతులకు మందులు, విత్తనాలు ఉద్దెరకు ఇస్తున్నారు. పత్తి తీయగానే ఇళ్ల ముందే కాంటాలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. తూకంలో సైతం రైతులను మోసం చేస్తున్నారు. లైసెన్స్ లేని ట్రేడర్లు దర్జాగా పత్తి తూకం వేసి వాహనాల్లో పత్తిని తరలిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు గ్రామాల్లో పర్యటించి తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. గ్రామ పంచాయతీలకు సైతం దళారులు ఒక్క రూపాయి చెల్లించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీరో వ్యాపారాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



లారీలో పత్తిని నింపుతున్న దళారులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. చట్టప్రకారం అర్జీలను పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించి ప్రజలకు మరింత దగ్గర కావాలని పోలీస్ అధికారులకు చెప్పారు. శాంతి భద్రతలు పరిరక్షించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పని చేస్తుందని వివరించారు.



బాధితులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ

ముక్క.. మంచిదేనా?

- మాంసం విక్రయాల్లో కనిపించని నాణ్యత పరీక్షలు
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం
- మున్సిపాలిటీల్లో కబేళాలు కరువు

మెదక్ మున్సిపాలిటీ: మాంసం విక్రయాల్లో నిబంధనలు పాటించడం లేదు. జీవాలు ఆరోగ్యమైనవేనా..? కాదా అని పశు వైద్యాధికారులు ధ్రువీకరించడం లేదు. దీంతో వ్యాపారులు ఇష్టారీతిగా మాంసం విక్రయాలు చేపడుతున్నారు. కబేళాల్లో జీవాలను వధించాల్సి ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రజారోగ్యశాఖ అధికారులైనా కనీసం జంతువులకు జీవం ఉందా.. లేదా అనే విషయాన్ని పరిశీలించడం లేదు. స్టాంపు వేయకుండానే వ్యాపారులు యథేచ్ఛగా మాంసాన్ని విక్రయిస్తున్నారు.

దుర్వాసన, దోమలతో అవస్థలు

నిబంధనల ప్రకారం మాంసం అమ్మే వ్యాపారులు కచ్చితంగా కబేళాలోనే వధించాలి. కానీ వారి ఇంటి వద్దే జీవాలను కోసి విక్రయిస్తున్నారు. రోగాలు, వయసు పైబడిన జీవాలను వధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇళ్ల మధ్య వధించడంతో దుర్వాసన, దోమలతో భరించలేక అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మున్సిపాలిటీలో రోడ్ల మీదనే మాంసం విక్రయిస్తున్నారు. మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల్లో ఒక్క చోట వధశాలలు లేవు. మున్సిపాలిటీలోనే కాకుండా గ్రామాల్లో సైతం జీవాలను పరిశీలించే వ్యవస్థ లేదు.

నిధులు ఉన్నా.. పనులు చేయలేదు

మెదక్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతీ రోజు పెద్ద సంఖ్యలో మాంసం అమ్మకాలు జరుగుతున్నాయి. అయితే పట్టణ శివారులో కబేళా నిర్మాణం కోసం గతంలో 14 ఫైనాన్స్ ద్వారా రూ. 90 లక్షలు నిధులు మంజూరు చేశారు. అయితే ఆ నిధులతో నిర్మాణం చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నాలుగేళ్లు గడిచినా పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా రెవెన్యూ అధికారులు కబేళా నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడం లేదని సాకు చూపుతున్నారు.

క్వింటాళ్ల కొద్దీ అమ్మకం

జిల్లాలో రోజూ క్వింటాళ్ల కొద్ది మాంసం అమ్మకాలు జరుగుతుంటాయి. సాధారణ రోజుల్లో రోజుకు 300పైగా మేకలను వధిస్తుండగా, ఆదివారం, పండగ రోజుల్లో మూడు నుంచి నాలుగు వేలకుపైగా మేకలను వధిస్తుంటారు. అలాగే జిల్లాలో ఎక్కడా కూడా ఒక్క కబేళా లేదు. ఎక్కడో వధించిన మేకలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల చనిపోయినవి, అనారోగ్యానికి గురైన వాటిని అమ్ముతున్నారు. వధశాల ఉంటే అక్కడ పశు వైద్యాధికారి ఉండి ఆరోగ్యకరంగా ఉన్న వాటినే విక్రయించడానికి అనుమతిస్తారు. వాటికి మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ అధికారి స్టాంపు వేసిన తర్వాతే విక్రయాలు జరపాలి. కాని జిల్లాల్లో ఎక్కడా అలా జరగడం లేదు.



మెదక్ మార్కెట్‌లో మాంసం విక్రయాలు

క్లుప్తంగా

అభిజిత్‌ యాదవ్‌కు సిల్వర్‌ మెడల్‌

రోయింగ్‌ చాంపియన్‌ షిప్‌లో ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న అభిజిత్‌ యాదవ్‌



మెడల్‌తో అభిజిత్‌

హుస్నాబాద్‌: కేరళ రాష్ట్రం అల్లెప్పీలో జరిగిన ఆల్‌ ఇండియా ఇంటర్‌ స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా రోయింగ్‌ చాంపియన్‌ షిప్‌ పోటీల్లో హుస్నాబాద్‌ పట్టణానికి చెందిన కాశబోయిన అభిజిత్‌ యాదవ్‌ సిల్వర్‌ మెడల్‌ సాధించాడు. 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రోయింగ్‌ చాంపియన్‌ పోటీలు నిర్వహించారు. అభిజిత్‌ హకీంపేట స్పోర్ట్స్‌ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. గతంలో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పురలో జరిగిన 25వ సబ్‌ జూనియర్‌ నేషనల్‌ రోయింగ్‌ అండర్‌–15 విభాగం డబుల్స్‌లో అభిజిత్‌ యాదవ్‌ సిల్వర్‌ మెడల్‌ సాధించాడు.

అప్పుల బాధతో యువకుడు బలవన్మరణం



చింటూ (ఫైల్‌)

పెద్దశంకరంపేట(మెదక్‌): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం పెద్దశంకరంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పేటకు చెందిన జంగం చింటూ(25) కొంత కాలంగా హైదరాబాద్‌లోని బీరంగూడలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కుటుంబీకుల అనారోగ్యం కారణంగా రూ.4 లక్షల వరకు బంధువుల వద్ద అప్పు చేశాడు. అప్పు తీరడం లేదని భార్య శిరీషకు చెబుతూ బాధపడేవాడు. ఆదివారం పేటకు బంధువుల వివాహానికి వచ్చి స్థానిక తిరుమలాపూర్‌ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మృతదేహం చెరువులో లభ్యమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్‌ తెలిపారు.

ఉచిత కార్పొరేషన్‌ విద్యకు జక్కాపూర్‌ విద్యార్థులు ఎంపిక

సిద్దిపేటరూరల్‌: జక్కాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉచిత కార్పొరేషన్‌ విద్యకు నిర్వహించిన పరీక్షలో సత్తా చాటారు. సదిశ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో కరీంనగర్‌ జిల్లా చొప్పదండి మండలం అరుణకొండలో రాష్ట్ర స్థాయిలో రెండేళ్ల ఉచిత కార్పొరేషన్‌ విద్యకు పరీక్ష నిర్వహించారు. అన్ని జిల్లాల నుంచి దాదాపు 1,500 మంది విద్యార్థులు హాజరు కాగా 21 మంది ఎంపికయ్యారు. ఇందులో జక్కాపూర్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు చింతల అన్వేష్‌, బీ. ప్రశాంత్‌, ఈర్ల సౌమ్య, యాట అనూష్‌, కూరాటి లిఖిత ప్రతిభ కనబర్చారు. విద్యార్థుల ఉత్తమ ప్రతిభ సాధించడానికి కృషి చేసిన గణిత ఉపాధ్యాయులు మట్ట మల్లారెడ్డి, పాతూరి తిరుపతిని సోమవారం ప్రధానోపాధ్యాయులు షౌకత్‌అలీ అభినందించారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్‌: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని పౌర సరఫరాల విజిలెన్స్‌ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్‌ నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా రేషన్‌ బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారంతో తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధి ముత్తంగి వద్ద అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో లారీలో అక్రమంగా తరలిస్తున్న 283 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని గుర్తించారు. అలాగే, బీడీఎల్‌ భానూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 45 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్నారు. అందోల్‌కు చెందిన జక్కపల్లి శంకర్‌ పటాన్‌చెరు మండలంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన రేషన్‌ బియ్యాన్ని ఆటోలో తీసుకెళ్లి పాశమైలారం ప్రాంతంలో లారీలో డంప్‌ చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం బీడీఎల్‌ పోలీసులు, సివిల్‌ సప్లయ్‌ అధికారులు వెళ్లి పట్టుకున్నారు. లారీ, ఆటోను సీజ్‌ చేసి జక్కపల్లి శంకర్‌తోపాటు ఇస్నాపూర్‌కు చెందిన లారీ డ్రైవర్‌ విశాల్‌, భువనగిరికి చెందిన ఆటో డ్రైవర్‌ శ్రీకాంత్‌ను అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నామమాత్రమే..



బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

సుడా లేఅవుట్‌ వేలానికి స్పందన కరువు

- 98 ప్లాట్లకు కేవలం 9 అమ్మకం
- మిగతా 89 ప్లాట్లకు 20న వేలం
- మరోవైపు పరిహారం కోసం నిరసన

సిద్దిపేటజోన్‌: సిద్దిపేట పట్టణ శివార్లలో మిట్టపల్లి సరిహద్దుల్లో సిద్దిపేట అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ(సుడా) చేసిన లేఅవుట్‌ స్థలాల బహిరంగ వేలం పాటకు స్పందన కరువైంది. సోమవారం సుడా కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో 98 ప్లాట్లకు గాను కేవలం ఏడుగురు ఆశావహులు హాజరయ్యారు. వారిలో ఒక్కడే మూడు ప్లాట్లను, మరొకరు రెండు ప్లాట్లను వేలం పాటలో దక్కించుకున్నారు. దీంతో మొదటి విడత వేలం పాటలో కేవలం 9 ప్లాట్లు నామమాత్రంగా అమ్మకం కాగా మిగిలిన 89 ప్లాట్లకు సంబంధించి మళ్లీ 20న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నారు. అత్యధికంగా గజానికి రూ.6,600 ధర పలుకగా, అత్యల్పంగా రూ. 5700 ధర పలికింది.

పరిహారం కోసం నిరసన..

మరోవైపు సుడా లేఅవుట్‌ వేలం పాట సమయంలో మిట్టపల్లి గ్రామానికి చెందిన వారు పరిహారం అందలేదని నిరసన వ్యక్తం చేశారు. సుడా వైస్‌ చైర్మన్‌, మున్సిపల్‌ కమిషనర్‌ ఆశ్రిత్‌ కుమార్‌ పర్యవేక్షణలో 98 ప్లాట్లకు సంబంధించిన బహిరంగ వేలం పాట మొదలైంది. ముంద్రాయి గ్రామానికి చెందిన గుండెల్లి లింగం బహిరంగ వేలం పాటలో మూడు ప్లాట్లను సొంతం చేసుకున్నారు. అదే విధంగా ఆనంతుల వీరన్న, నిఖిల తండ్రి. కూతుళ్లు రెండు ప్లాట్లను సొంతం చేసుకున్నారు. వీరితోపాటు రాగుల రవీందర్‌, జయంతి, ప్రశాంత్‌, శశికాంత్‌లు ప్లాట్లను వేలం పాటలో దక్కించుకున్నారు. వేలం పాటలో ప్లాట్లు పొందిన వారు వారం రోజుల్లో 25 శాతం డబ్బులు కట్టాలని, మిగితా డబ్బులు 60 రోజుల్లో చెల్లించాలని సుడా వైస్‌ చైర్మన్‌ ఆశ్రిత్‌ కుమార్‌ సూచించారు. మిగిలిన ప్లాట్లకు ఈనెల 20న తిరిగి బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. మరోవైపు సుడాలో వేలం పాట జరుగుతున్న విషయం తెలుసుకున్న మిట్టపల్లికి చెందిన వడ్లకొండ సతీష్‌, అఖిల్‌ గౌడ్‌లు తమ కుటుంబ సభ్యులతో కార్యాలయానికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. సుడా వెంచర్‌కు సంబంధించి ఎలాంటి పరిహారం ఇవ్వలేదని, తమకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. విషయం తెలుసుకున్న త్రీ టౌన్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పి తీసుకెళ్లారు.



సుడా అధికారులతో పరిహారం కోసం మొర పెట్టుకుంటున్న బాధితులు

వరుస హత్యల కేసు కొలిక్కి!

- మృతుల గుర్తింపుతో కేసులో పురోగతి
- పోలీస్‌ల అదుపులో అనుమానితుడు

చిన్నశంకరంపేట(మెదక్‌): ఒకే తరహాలో జరిగిన వరుస హత్యల కేసులో ఓ యువకుడిని పోలీస్‌లు అదుపులోకి తీసుకొని విచారించగా కేసు కొలిక్కివచ్చినట్లు తెలిసింది. చిన్నశంకరంపేట మండల కేంద్రంలో తొమ్మిది రోజుల వ్యవధిలో రెండు వరుస హత్యలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ హత్యలపై స్థానికంగా భయానక పరిస్థితి నెలకొనగా, పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని గుర్తించి విచారిస్తున్నట్లు సమాచారం. అక్టోబర్‌ 23న రాత్రి చిన్నశంకరంపేట ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గుర్తు తెలియని యువకుడిని బండరాయితో హత్య చేసి నిప్పు పెట్టిన సంగతి మరవక ముందే ఈనెల 3న పద్మారాయుడి గుట్ట వద్ద బస్టాండ్‌లో మరో గుర్తు తెలియని యువకుడి హత్య జరిగింది. ఈ రెండు హత్యలు కూడా ఒకే తరహాలో జరుగగా ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

పదేళ్ల కిందట బస్టాండ్‌లో ఇదే తరహా హత్య..

చిన్నశంకరంపేట మండల కేంద్రంలో పదేళ్ల కిందట బస్టాండ్‌లో ఇదే తరహా హత్య జరిగింది. ఈ కేసులో హంతకుడు జైలు జీవితం గడిపి బయటకొచ్చాడు. తాజాగా రెండు వరుస హత్యల తర్వాత యువకుడు పోలీస్‌స్టేషన్‌ ఎదురుగా రోడ్డుపై వెలుతూ ముఖానికి చేతులు అడ్డం పెట్టుకొని తిరగడంతో పోలీస్‌లకు అనుమానం వచ్చింది. హత్యజరిగిన రోజు కూడా డాగ్‌స్క్వాడ్‌ నిందితుడు నివాసం ఉన్న గ్రామం వైపు వెళ్లి వెనక్కి వచ్చాయి. దీనికి తోడు మృతుల వివరాలు కూడా తెలియడంతో కేసు కొలిక్కివచ్చింది. కామారెడ్డి జిల్లాకు చెందిన చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనుమానిత యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో పోలీస్‌లు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

నిర్మాణంలోని కోళ్ల ఫారం గోడ కూలి..

- ఇద్దరు వలస కార్మికులు మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు





గోడ కూలి మృతి చెందిన కార్మికులు

చిన్నశంకరంపేట(మెదక్‌): నిర్మాణంలో ఉన్న కోళ్ల ఫారమ్‌ గోడ కూలి ఇద్దరు వలస కార్మికులు మృతి చెందారు. ఈ విషాదకర ఘటన చిన్నశంకరంపేట మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కామారం తండాలో కామారెడ్డికి చెందిన సాయిబాబారెడ్డి కోళ్ల ఫారం నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పనులను జార్కండ్‌ రాష్ట్రానికి చెందిన వలస కార్మికులు వసికుల్‌ అలం(27), రకివాల(22) మేస్త్రీలుగా ఉండి చేస్తున్నారు. కోళ్లఫారమ్‌కు రెండు కిందట రెండు వైపుల ఎత్తైన గోడలు నిర్మించారు. మూడో రోజు అదే గోడలపై మరిన్ని ఇటుకలను పెట్టే క్రమంలో గోడ కుప్ప కూలిపోయింది. దీంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. తోటి కార్మికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్‌ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వేణుగోపాల్‌(ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మక్కరాజీపేట బ్రిడ్జి వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన వడ్డేపల్లి వేణుగోపాల్‌(32) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ తాను ఉంటున్న ఇంటిని ఖాళీ చేస్తానని చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్‌ను తీసుకెళ్లాడు. రూమ్‌ను ఖాళీ చేసి ఇద్దరూ స్కూటీపై సోమవారం చిన్నమల్లారెడ్డి గ్రామానికి వస్తున్నారు. చేగుంట శివారులోని మక్కరాజీపేట బ్రిడ్జి వద్ద యూటర్న్‌ తీసుకుంటున్న డీసీఎం స్కూటీని ఢీకొట్టగా ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో వేణుగోపాల్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, రంజిత్‌ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రంజిత్‌ కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి తండ్రి పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిశ్రమలో కిందపడి కార్మికుడు

చేగుంట(తూప్రాన్‌): పరిశ్రమలో పని చేస్తూ కింద పడి కార్మికుడు మృతి చెందిన ఘటన చేగుంట శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బీహార్‌ రాష్ట్రానికి చెందిన అభిమన్యు(21) వెన్‌ కాఫ్‌ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అక్కడ ఎత్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కింది పడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో ధాన్యం కాపలాదారుడు

హత్నూర(సంగారెడ్డి): గుండెపోటుతో దాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కాపలాదారుడు మృతి చెందాడు.ఈ ఘటన హత్నూర మండలం సిరిపురం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు.. గ్రామానికి చెందినపూల దుర్గయ్య(55) గతేడాది లాగే ఈసారి ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద కాపలాదారుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి వద్ద భోజనం చేసి కాపలా కోసం కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లాడు. సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయంత తెలుసుకున్న డీపీఎం కొమురయ్య ఎంపీడీఓ శంకర్‌, ఏపీఎం దేవేందర్‌ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. గ్రామ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.20 వేలు మృతుడి కుటుంబానికి తహసీల్దార్‌ షేక్‌ పర్వీన్‌ అందజేశారు.

ఇంటి పైనుంచి పడి వ్యక్తి..



రాజు(ఫైల్‌)

మనోహరాబాద్‌(తూప్రాన్‌): ఇంటిపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం మనోహరాబాద్‌ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ కథనం మేరకు.. మండలంలోని కోనాయపల్లి(పీటీ) గ్రామానికి చెందిన చిర్మాణీ రాజు(52) ఆదివారం సాయంత్రం ఓ శుభకార్యం నిమిత్తం కొమ్మలు తెంపుడానికి ఇంటి పైకి ఎక్కాడు. ఇల్లును ఆనుకొని ఉన్న చెట్లుపై కొమ్మలు తెంపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన రాజును చికిత్స నిమిత్తం మేడ్చల్‌లోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కూతురు భవాని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు

కొండపాక(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్‌ గ్రామానికి చెందిన భార్యాభర్తలు లక్ష్మీనర్సవ్వ, మల్లయ్య ద్విచక్ర వాహనంపై తొగుటకు వెళ్తుండగా తిమ్మారెడ్డిపల్లి దాబా హోటళ్ల వద్ద యూటర్న్‌ అవుతున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి హైదరాబాద్‌ వైపునకు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్‌..

బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలైన ఘటన కొండపాక మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బందారం గ్రామానికి చెందిన వరుణ్‌తేజ్‌ సిద్దిపేట నుంచి బైక్‌పై వస్తున్నాడు. దుద్దెడ శివారులోకి రాగానే బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా విషయం తెలుసుకున్న 108 సిబ్బంది స్థలానికి చేరుకొని సిద్దిపేట ప్రభుత్వానికి తరలించారు.

మహిళా రిజర్వేషన్‌ చట్టాన్ని సవరించాలి

ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సృజన



సమావేశంలో మాట్లాడుతున్న సృజన

సిద్దిపేటఅర్బన్‌: చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో చేసిన రిజర్వేషన్‌ చట్టం 'నారీ శక్తి వందన్‌ అభినియం'ను సవరించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు సృజన అన్నారు. సోమవారం సిద్దిపేటలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో నిర్వహించిన ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా నిర్మాణ కౌన్సిల్‌ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చలకు అనుమతి లేకుండా నారీ శక్తి వందన్‌ అభినియం పేరుతో రాజ్యాంగంలోని 128వ సవరణ ద్వారా బిల్లును ఆమోదింపజేసిందన్నారు. దీని ద్వారా మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్‌ అమలు చేయడానికి కొన్ని అడ్డంకులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ చట్టం వల్ల మహిళలకు ఎలాంటి ఉపయోగం లేదని, తక్షణమే సవరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి రజిని, మహిళా సమాఖ్య జిల్లా నిర్మాణ బాధ్యులు శంకర్‌, మహిళా నాయకులు సావిత్రి, సులోచన, రజిత, మల్లవ్వ, పరమేశ్వరి, సమత, లలిత, రాజవ్వ, లక్ష్మి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోరీల కేసులో ఇద్దరు రిమాండ్‌



మాట్లాడుతున్న సీఐ సుధీర్‌ కుమార్‌

జిన్నారం (పటాన్‌చెరు): తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌ చేస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను గుమ్మడిదల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సుధీర్‌ కుమార్‌ సోమవారం జిన్నారం పోలీస్‌ స్టేషన్‌ లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చార్మినార్‌కు చెందిన హమీద్‌ సయ్యద్‌(42) కూలీగా పని చేసేవాడు. అక్రమంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. 3వ తేదీన మధ్యాహ్నం గుమ్మడిదల గ్రామానికి చెందిన రవీందర్‌ రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడగా బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీల ద్వారా నిందితుడు హమీద్‌ సయ్యద్‌ అని నిర్ధారించి పట్టుకున్నట్లు తెలిపారు. ఇతడిపై రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సుమారు 150 నుంచి 200 వరకు కేసులు ఉన్నట్లు విచారణలో తేలింది. సీఐ సుధీర్‌ కుమార్‌ గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్‌ రెడ్డి హెడ్‌కానిస్టేబుల్‌ మున్యా నాయక్‌ కిషోర్‌ నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించారు.

ఒకరు అరెస్ట్‌, ఇద్దరు పరారీలో..

జోగిపేట(అందోల్‌): దొంగతనం కేసులో ఒకరిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు జోగిపేట సీఐ అనిల్‌ కుమార్‌ తెలిపారు. సోమవారం జోగిపేట సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామానికి చెందిన వెంకట్‌ రెడ్డి వ్యాపార నిమిత్తం బీదర్‌లో స్థిరపడ్డారు. గ్రామంలో తన తల్లి సునంద ఒక్కరే ఉండగా అప్పుడప్పుడూ ఊరికి డ్రైవర్‌ మహిపాల్‌రెడ్డిని వెంట తీసుకొచ్చేవాడు. సునంద ఇంటి వద్ద ఒక్కరే ఉండటంతో డ్రైవర్‌ దొంగతనం చేయాలని పథకం వేశాడు. తనకు పరిచయమున్న మోసిన్‌, సోహెల్‌తో కలిసి అక్టోబర్‌ 21న పల్వట్లకు అర్ధరాత్రి చేరుకున్నాడు. సునందను మహిపాల్‌రెడ్డి లేపి నోట్లో గుడ్డలు కుక్కి కాళ్లు కట్టి పడేశారు. ఆమె మెడలోని నాలుగు తులాల పుస్తెలతాడు, బంగారు నగలు, రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధితులు వట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డ్రైవర్‌ మహిపాల్‌రెడ్డిని సోమవారం బీదర్‌ ప్రాంతంలో అరెస్టు చేసి విచారించగా నేరం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ విఠల్‌, హెడ్‌కానిస్టేబుల్‌ సుందర్‌రాజ్‌లు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో..

ఇద్దరు నిందితులకు ఏడేళ్ల జైలు, జరిమానా

రామచంద్రపురం(పటాన్‌చెరు): కానిస్టేబుల్‌ పై హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించిన ఘటన రామచంద్రపురం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. 2022 జూలై 26న కూకట్‌ పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చైన్‌ స్నాచింగ్‌కి పాల్పడిన ముగ్గురు బీహెచ్‌ఎల్‌ వైపు వస్తున్నారని సీసీఎస్‌ పోలీసులకు సమాచారం అందింది. వారిని పట్టుకునే క్రమంలో సీసీఎస్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ యాదయ్య, కానిస్టేబుల్‌ రవి రామచంద్రపురం ఏరియాలో గండమ్మ ఆలయ వద్ద వేచి ఉన్నారు. అదే పోలికలు కలిగిన ఇద్దరు అనుమానితులు హెచ్‌ఐజీ గేట్‌ నుంచి బీహెచ్‌ఈఎల్‌ లోపలికి బైక్‌ పై వెళ్తుండగా వారిని వెంబడించి పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో నిందితులు హెడ్‌ కానిస్టేబుల్‌ను విచక్షణా రహితంగా పొడిచారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన నిరంజన్‌, రాహుల్‌ పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితులను సోమవారం ఎల్బీనగర్‌ కోర్టులో హాజరు పర్చగా ప్రిన్సిపల్‌ డిస్ట్రిక్ట్‌ జడ్జి ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి కోసం అంత్యక్రియలు నిలిపివేత

రిజిస్ట్రేషన్‌ అయ్యాకే పూర్తి చేసిన వైనం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆస్తి కోసం వృద్ధురాలి అంత్యక్రియలు నిలిపివేసిన ఘటన చిన్నకోడూరులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వంగ కిష్టవ్వ(90) ఆదివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందింది. కిష్టవ్వకు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. నలుగురిలో పెద్ద కుమారుడు, చిన్నకుమారుడు కొన్నేళ్ల కిందట మృతి చెందారు. రెండో కుమారుడు రాజేశం గతంలోనే తల్లి పేరున ఉన్న సుమారు రూ.30 లక్షల ఇంటిని తన పేరున రిజిస్ట్రేషన్‌ చేసుకున్నాడు. ఈ విషయమై మరణించిన ఇద్దరు కుమారుల పిల్లలు పలుమార్లు కుల సంఘం పెద్దల సమక్షంలో పెట్టినా రాజేశం వినలేదు. ఇప్పుడు కిష్టవ్వ మృతితో ఆ ఇంటిని మూడు భాగాలుగా చేస్తేనే అంత్యక్రియలు నిర్వహించాలని ఆ ఇద్దరు కుమారుల పిల్లలు అడ్డుకున్నారు. దీంతో గ్రామ గౌడ సంఘం పెద్దలు కలుగజేసుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పి నోటరీ ద్వారా ఇంటిని మూడు భాగాలు ఏర్పాటు చేశారు. దీంతో వృద్ధురాలి అంత్యక్రియలు జరపడానికి అంగీకరించారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తొమ్మిది తులాల బంగారం

సంగారెడ్డి క్రైమ్‌: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్‌ కథనం మేరకు.. బైపాస్‌లోని బాలాజీనగర్‌లో ఉండే రాజమణి పని నిమిత్తం 8న ఇంటికి తాళం వేసి గజ్వేల్‌ పట్టణానికి వెళ్లింది. సోమవారం ఉదయం తిరిగి ఇంటికొచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని తొమ్మిది తులాల బంగారం, రూ.5 వేల నగదు కనిపించలేదు. సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సత్తా చాటి బరిలో నిలిచి

- క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ
- రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయికి
- అభినందిస్తున్న పాఠశాలల ఉపాధ్యాయుల బృందం



ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బృందం



గజ్వేల్‌రూరల్‌: విద్యార్థులకు ట్రోఫీలు అందజేస్తున్న ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు

జాతీయస్థాయి సైక్లింగ్‌ పోటీలకు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): హైదరాబాద్‌లో జరిగిన ట్రాక్‌ నేషన్‌ తెలంగాణ సైక్లింగ్‌ పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినీలు రిజ్వానాబేగం, వర్షితలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు మనోహర్‌ తెలిపారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. 12 నుంచి 20 వరకు చెన్నై నగరంలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అదే విధంగా ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు నేషనల్‌ రాష్ట్ర స్థాయిలో జరిగిన సైక్లింగ్‌ పోటీల్లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీలు అంకిత, సాయిప్రసన్న, లిఖిత రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. డిసెంబర్‌ నెలలో దేశ రాజధాని ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో ఫిజికల్‌ డైరెక్టర్‌ పాతూరి సుజాత, స్టాఫ్‌ సెక్రటరీ ఆఫీసర్‌ ఉదయశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు కోట ప్రభ, శ్రీనివాస్‌ గౌడ్‌, అంజిరెడ్డి, మల్లయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌ పోటీలకు..

గజ్వేల్‌రూరల్‌: ఉమ్మడి మెదక్‌ జిల్లా తరపున వాలీబాల్‌ పోటీల్లో అండర్‌ –14 బాలికల విభాగంలో ఆర్‌అండ్‌ అర్‌ కాలనీ పాఠశాల విద్యార్థినులు అక్షిత, పవిత్ర, అండర్‌–17 బాల బాలికల విభాగంలో స్వామినాయక్‌, కావ్య, ఇందు, దీక్షేశ్వరి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరీమొద్దీన్‌ తెలిపారు. మెదక్‌ జిల్లా చేగుంటలో నిర్వహించిన పోటీల్లో మెరుగైన ప్రతిభను ప్రదర్శించారన్నారు. అలాగే సెయింట్‌ మేరీస్‌ విద్యానికేతన్‌ ప్రజ్ఞాపూర్‌ పాఠశాల విద్యార్థిని జయహాసిని అండర్‌–14 వాలీబాల్‌ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ రాయప్ప తెలిపారు. 17 నుంచి 20 వరకు చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

నేషనల్‌ హ్యాండ్‌ బాల్‌ మీట్‌కు..

మద్దూరు(హుస్నాబాద్‌): ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముద్రలో 25 నుంచి 29 వరకు నిర్వహించనున్న 68వ స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ జాతీయ హ్యాండ్‌ బాల్‌ పోటీల్లో మండల పరిధిలోని రేబర్తి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థి భార్గవి పాల్గొననున్నట్లు మండల విద్యాధికారి వరదరాజు సోమవారం తెలిపారు. 8 నుంచి 10 వరకు హుస్నాబాద్‌లో నిర్వహించిన అండర్‌–14 స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్‌ పోటీల్లో రాణించి, నేషనల్‌ హ్యాండ్‌ బాల్‌ పోటీలకు ఎంపికైంది. సోమవారం ఆమెను పీడీ రఫత్‌ ఉమర్‌, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, అభినందించారు.

వాలీబాల్‌ పోటీల్లో..

హవేళిఘణాపూర్‌(మెదక్‌): చేగుంటలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్‌ పోటీల్లో అండర్‌ 14 విభాగం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి రమావత్‌ సచిన్‌ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పీడీ సత్యనారాయణ తెలిపారు. అలాగే ఈనెల 16,17,18 తేదీల్లో చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

బందారం విద్యార్థిని..

కొండపాక(గజ్వేల్‌): రాష్ట్ర స్థాయి వాలీబాల్‌ పోటీలకు అండర్‌ 14 బాలికల విభాగంలో బందారం హైస్కూల్‌ విద్యార్థిని లక్ష్మీప్రసన్న ఎంపికై నట్లు హెచ్‌ఎం రాంచంద్రం పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి లక్ష్మి ప్రసన్నను అభినందిస్తూ రూ.1,000ల నగదుతోపాటు ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి క్రీడా షూలను అందజేయగా ఇతరత్ర ఖర్చులకు రమేశ్‌ ఉపాధ్యాయుడు సమకూర్చేందుకు ముందుకొచ్చాడు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్నను ప్రత్యేకంగా అభినందించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, బాల కనకయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

నాటిక ప్రదర్శనలో..



మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్‌): మెదక్‌ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి నాటిక ప్రదర్శన (రోల్‌ ప్లే)లో మండల కేంద్రంలోని మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు మొదటి స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చిన్నశంకరంపేట ఎంఈఓ పుష్పవేణి తెలిపారు. రెండో స్థానంలో మీర్జాపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు నిలిచి బహుమతులు పొందారని వివరించారు. మోడల్‌ స్కూల్‌కు చెందిన విద్యార్థులు శ్రీవల్లి, మణికంఠ, అభిజ్ఞ, చైతన్య, ఆర్తి చంద్ర నాటిక ప్రదర్శనలో యువతపై మాదకద్రవ్యాల ప్రభావం–నివారణ అంశంపై ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓ, స్కూల్‌ ప్రిన్సిపాల్‌ వాణి అభినందించారు.